క్లుప్తంగా

నేటి నుంచి వామనోపాఖ్యాన ప్రవచనం

విజయవాడకల్చరల్: సోమవారం నుంచి మూడు రోజుల పాటు శివరామకృష్ణ క్షేత్రంలో శ్రీవాస్యభాగవతంలోని వామనోపాఖ్యానం అంశంగా ఆధ్యాత్మిక ప్రసంగం నిర్వహిస్తున్నట్లు నిర్వాహక సంఘం కన్వీనర్ పి.సుబ్బారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో పండిత కానుగోవి వాసుదేవాచార్య ప్రవచనం చేస్తారన్నారు.

సుంకర రాజేంద్రప్రసాద్‌ను పరామర్శించిన గౌతంరెడ్డి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రముఖ న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్‌ను ఆదివారం వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ ఫైబర్‌నెట్ మాజీ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి పరామర్శించారు. మహిళా సాధికారితకు చివరి క్షణంకోసం పని చేసిన మహోన్నత వ్యక్తిత్వం జ్యోత్స్న సొంతమన్నారు. నేడు భౌతికంగా ఆమె లేకున్నప్పటికీ ఆమె అందించిన సేవలు ప్రతి ఒక్కరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచే ఉంటాయని చెప్పారు. జ్యోత్స్న మృతి మహిళా లోకానికి తీరని లోటు అని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాదులు విష్ణు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కళ్ళే లలిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేద ప్రజల సంక్షేమాభివృద్ధి కోసం గత రెండేళ్లగా అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని ఆ ట్రస్ట్ చైర్మన్ కళ్ళే నాగేశ్వరరావు అన్నారు. కళ్ళే లలిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ రైతుబజార్ వద్ద శనివారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కళ్ళే లలిత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు, కూలింగ్ వాటర్ మిషన్లు, శానిటరీ కార్మికులకు పరికరాలు, నూతన వస్త్రాల పంపిణీతో పాటు వరద బాధితులకు దుప్పట్లు, బియ్యం, సరుకులు వంటి అనేక సేవా కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. భవిష్యత్తులోనూ తమ ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతామన్నారు.

భక్తులు, భవానీలకు మజ్జిగ పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు, భవానీలకు ఆదివారం బీఆర్టీఎస్ రోడ్డులో హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు కోరంగి నాగమల్లిక, షఫీవుల్లా, బి.వసంతకుమార్ మాట్లాడుతూ ఎంతో దూరం నుంచి నగరానికి వచ్చిన భక్తులకు తమవంతు బాధ్యతగా మజ్జిగ అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్టీలు హేమంతరావు, ఫణి, కె.రాము తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా మోహినీ భస్మాసుర నృత్యరూపకం



విజయవాడకల్చరల్: దసరా మహోత్సవాల సందర్భంగా కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో 10 రోజులుగా నిర్వహిస్తున్న సంప్రదాయ నృత మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. కూచిపూడి సిద్ధేంద్రయోగి కళాపీఠం ఆచార్యులు డాక్టర్ చింతారవి బాలకృష్ణ నృత్య పర్యవేక్షణలో మహినీ భస్మాసుర నృత్య రూపకాన్ని నేత్రపర్వంగా ప్రదర్శించారు. నృత్య కార్యక్రమంలో మోహినిగా దాట్ల శ్రీసాయి, భస్మాసురినిగా యశశ్రీ, విష్ణుమూర్తిగా కృష్ణనునంద శ్రీయ, శివునిగా యామిని, పార్వతిగా ఈశ్వరి నృత్యాలను అభినయించారు.

యువతకు కొలువుల భాండాగారం

- అందుబాటులో అన్ని రకాల పోటీ పరీక్షల పుస్తకాలు
- నిరుద్యోగుల పాలిట వరంగా చిత్తరంజన్ గ్రంథాలయం
- ఎందరికో ప్రభుత్వ కొలువులు సాధించిపెట్టిన ఆధునిక దేవాలయం
- గత ఏడాది కాలంలో 10 మందికి ప్రభుత్వ, బ్యాంకు ఉద్యోగాలు



సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయం నిరుద్యోగుల పాలిట వరంగా మారింది. సాధారణ పుస్తకాలతో పాటుగా నిరుద్యోగులకు ప్రభుత్వ రంగ సంస్థల్లో కొలువు సాధించేందుకు అవసరమైన అన్ని రకాల పోటీ పరీక్షల పుస్తకాలు, స్టడీ మెటీరియల్స్ ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. వీటిని సద్వినియోగం చేసుకుని ఎంతోమంది నిరుద్యోగ యువతీ, యువకులు ప్రభుత్వ కొలువులు సాధించారు.

అందుబాటులో 28 వేలకు పైగా పుస్తకాలు...

జిల్లా గ్రంథాలయ శాఖ అధీనంలో నడుస్తున్న చిత్తరంజన్ గ్రంథాలయం 1961లో సత్యనారాయణపురంలో ఏర్పాటైంది. కొద్దిపాటి వార్తా పత్రికలు, ఇతర పుస్తకాలతో ఏర్పాటు చేసిన ఈ గ్రంథాలయం నేడు అన్ని రకాల వార్తా పత్రికలతో పాటు 28,199 పుస్తకాలు అందుబాటులో ఉండటంతో నిత్యం పాఠకులు, విద్యార్థులు, పోటీ పరీక్షలకు హాజరయ్యే నిరుద్యోగ యువతతో కళకళలాడుతోంది. నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన దిశగా ప్రస్తుత గ్రంథాలయ అధికారి సంపత్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. జిల్లా గ్రంథాలయశాఖ, దాతల సాయంతో సివిల్ సర్వీస్, ఆర్‌ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్, ఏపీపీఎస్‌సీ, డీఎస్‌సీ, పోలీస్ రిక్రూట్‌మెంట్ తదితర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కొలువులకు అవసరమైన 5వేల పోటీపరీక్షల పుస్తకాలు, స్టడీ మెటీరియల్స్‌ను నిరుద్యోగ యువతకు అందుబాటులోకి తీసుకురావటంలో ఎంతో కృషిచేశారు. 2023-24 సంవత్సరంలోనే సుమారు 10 మంది నిరుద్యోగులు ఆర్‌ఆర్‌బీ, పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో ఇక్కడ పుస్తకాలను రిఫర్ చేయడం ద్వారా ఉద్యోగాలు సాధించారు. ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో బొక్కా సోనియా ఉమెన్స్ ఎస్ఐగా ఎంపికయ్యారు. సదరన్ రైల్వేలో హాస్పిటల్ అసిస్టెంట్‌గా ఎస్.చిట్టిబాబు, విజయవాడ డివిజన్ చినగంజాంలో ట్రాక్ మెయింటెనర్‌గా సిద్ధపు వెంకటేశ్వర్లు, విజయవాడలో ట్రాక్ మెయింటెనర్‌గా ఓబుల్ రెడ్డి నరసింహారావు, అడపాక సాయికుమార్, సౌత్ వెస్ట్రన్ రైల్వేలో ట్రాక్ మెయింటెనర్‌గా మెట్టా వాసుదేవరావు ప్రభుత్వ కొలువులు సాధించారు.



గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పోటీ పరీక్షల పుస్తకాలు

యువతకు అవసరమైన అన్ని పుస్తకాలు ఉన్నాయి



నిరుద్యోగ యువతకు అవసరమైన పోటీ పరీక్షల పుస్తకాలు, స్టడీ మెటీరియల్స్‌ను అందుబాటులో ఉంచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. దీని కోసం జిల్లా గ్రంథాలయ శాఖ అధికారులు, కొంతమంది దాతల సహకారంతో ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్‌కు సంబధించిన పుస్తకాలను అందుబాటులో ఉంచుతున్నాం. మా గ్రంథాలయం నుంచి ఇప్పటికే ఎంతో మంది యువత ఉద్యోగాలు సాధించారు.

– పి. సంపత్‌కుమార్, గ్రంథాలయ అధికారి



దత్తసాయి శివకామేశ్వరీపీఠంలో రాజరాజేశ్వరీదేవి



బావాజీపేటలో రాజరాజేశ్వరీదేవి అలంకరణలో..



అంకమ్మతల్లి శక్తిపీఠంలో రాజరాజేశ్వరీదేవి



ముత్యాలంపాడులో రాజరాజేశ్వరీదేవిగా



విలేజి కండ్రికలో అమ్మవారికి పూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విష్ణు

ఘనంగా ముగిసిన దసరా ఉత్సవాలు

నగరంలోని ఆలయాల్లో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. విజయ దశమి సందర్భంగా శనివారం ఆలయాల్లో శమీ పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గత 10 రోజులుగా అమ్మవార్లు విశేష అలంకారాల్లో దర్శనమిచ్చారు. ఆదివారం అన్న సంతర్పణలు, అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. దీంతో నగర వ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.

– మధురానగర్(విజయవాడసెంట్రల్)

బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయవాడకల్చరల్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబాసాహెబ్ అంబేడ్కర్ అని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపక సభ్యుడు బీవీ వీరభద్రరావు అన్నారు. అంబేడ్కర్ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళా వేదికపై ఆదివారం అంబేడ్కర్ స్ఫూర్తి సభ, సినీ సంగీత విభావరి నిర్వహించారు. సంస్థ సంయుక్త కార్యదర్శి కె.డేవిడ్ రాజు మాట్లాడుతూ అంబేడ్కర్ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సభలో సంస్థ కార్యవర్గ సభ్యులు మాలపాటి వెంకటపతి, ఆదిరాల జయప్రభు, పల్లెకొండ శ్రీనివాసరావు, మారేపల్లి జోషి అంబేడ్కర్ జీవిత విశేషాలను వివరించారు. గాయనీ గాయకులు చందన, సమీన, ప్రిన్స్, పరమేశ్వరిలు మెలోడీ గీతాలను ఆలపించారు. కార్యక్రమాన్ని సినీ రంగస్థల నటుడు కొప్పుల ఆనంద్ నిర్వహించారు.



అంబేడ్కర్ స్ఫూర్తి సభలో పాల్గొన్న సంస్థ సభ్యులు దేవిడ్‌రాజు, వీరభద్రరావు తదితరులు

కనులపండువగా కల్యాణోత్సవం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీకోదండ రామాలయంలో శనివారం శ్రవణా నక్షత్రం పురస్కరించుకుని శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛారణలతో స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేపట్టారు.



కేశఖండన శాల వద్ద తలనీలాలు సమర్పిస్తున్న భవానీలు



జల్లు స్నానాలు చేస్తున్న భవానీలు



ఎరుపెక్కిన ఇంద్రకీలాద్రి..

ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మ సన్నిధిలో శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు శనివారంతో ముగిసినా ఆదివారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. వేలాది మంది భవానీలు అమ్మవారిని దర్శించుకునేందుకు తరలిరావడంతో ఇంద్రకీలాద్రి ఎరుపెక్కింది. కొందరు భవానీలు తమ దీక్షలు విరమించారు. లోకమాతా.. కరుణించమ్మా అంటూ భవానీలు అమ్మవారిని వేడుకున్నారు.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



కిటకిటలాడుతున్న క్యూలైను



దీక్ష విరమణ చేస్తున్న భవానీలు



అంతరాలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో బాబా మహా సమాధి ఉత్సవం



బాబా సమాధిపై పూలమాల వేస్తున్న మల్లాది విష్ణు, పి.గౌతంరెడ్డి



ముత్యాలంపాడులో బాబా సమాధి నమూనా

మధురానగర్(విజయవాడసెంట్రల్): షిర్డీ సాయినాధుని 106వ పుణ్యతిథి మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆంధ్రా షిర్డీ ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరం, మధురానగర్ శ్రీ భగవాన్ షిర్డీసాయిబాబా మందిరం, పసుపుతోట శ్రీదత్తసాయి మందిరం, లెనిన్ సెంటర్‌లోని శ్రీషిర్డీనాగసాయిబాబా మందిరం, చుట్టుగుంట శ్రీ కల్యాణ షిర్డీసాయిబాబా మందిరంలో బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. షిర్డీసాయినాథుని నమూనా సమాధిని ఏర్పాటు చేసి పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు బాబావారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆధ్యాత్మికతోనే ప్రశాంతమైన జీవితం గడపవచ్చని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం పుణ్యతిథి మహోత్సవాల్లో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డితో కలిసి పూజలు చేశారు. గౌతంరెడ్డి మాట్లాడుతూ తాము గత పది రోజులుగా లోక కళ్యాణార్థం భక్తులు, దాతల సహకారంతో ప్రత్యేక పూజలు అభిషేకాలు, విశేషంగా హోమాలు నిర్వహించామన్నారు. శనివారం పుణ్యతిథి మహోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన హోమం పూర్ణాహుతి జరిగింది. ఆదివారం మధ్యాహ్నం కుంచనపల్లి రవిశంకర్ దంపతులచే అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో కార్పొరేటర్ శర్వాణి మూర్తి, కుంచనపల్లి రవిశంకర్, పొన్నలూరి లక్ష్మణరావు, మండలపర్తి సత్యశ్రీహరి, సుధీర్ తదితరులు ఉన్నారు.

పలు మందిరాల్లో

పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో బాబావారికి 1,008 వెండి పుష్పాలతో అర్చనలు నిర్వహించారు. శ్రీసాయినక్షత్రమాలిక మండలి ఆధ్వర్యాన పారాయణం జరిగింది. మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు పర్యవేక్షించారు. మధురానగర్ మెయిన్‌రోడ్డులోని శ్రీ భగవాన్ షిర్డీసాయిబాబా మందిరంలో బాబా పుణ్యతిథి మహోత్సవాలు ఘనంగా జరిగాయి. మందిర గౌరవాధ్యక్షులు పిల్లి లక్ష్మీతులసి, పీవీఎల్ఎస్‌రాజు భక్తులతో కలిసి పూజలు చేశారు. లెనిన్ సెంటర్‌లోని శ్రీషిర్డీ నాగసాయిబాబా, నాగమానసాదేవి మందిరంలో పుణ్యతిథి మహాసమాధి ఉత్సవం ఘనంగా జరిగింది. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో ఉదయం నుంచి బాబాకు అభిషేకాలు జరిగాయి. కార్పొరేటర్ ఎన్.బాలస్వామి, వైఎస్సార్‌సీపీ 25వ డివిజన్ అధ్యక్షుడు బంకా భాస్కరరావులు ముఖ్య అతిథులుగా పాల్గొని పూజలు చేశారు. అనంతరం పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. చుట్టుగుంట శ్రీ కల్యాణ షిర్డీసాయిబాబా మందిరంలో బాబా పుణ్యతిథి మహోత్సవాలు ఘనంగా జరిగాయి. పగడాల మధుసూదనరావు పర్యవేక్షించారు.

వరద బాధితులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న దాతలు



వరద బాధితులకు కిట్లు అందజేస్తున్న రెవ.సునీల్‌కుమార్, జోసఫ్ తదితరులు

పాయకాపురం(విజయవాడరూరల్): హైదరాబాద్‌కు చెందిన దేవదాస్ ఆశాలత దసరా పండుగను పురస్కరించుకొని వరద బాధితులకు పాయకాపురం స్పందన సేవా సమితి కార్యాలయం వద్ద దుస్తులు పంపిణీ చేశారు. 60 వేల విలువైన దుప్పటి, లుంగీ, చీరలను 90 మంది వరద బాధిత కుటుంబాలకు అందచేశారు. కార్యక్రమంలో దేవ్ ఆనంద్, స్పందన సేవా సమితి అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణప్రసాద్, వాంబే కాలనీకి చెందిన ఆర్ఎస్ నాయుడు, సమితి ప్రతినిధులు డి.మురళీ, కె.నరసింహామూర్తి, విమలరాణి, అనుపమ, శ్యామల పాల్గొన్నారు.

బియ్యం, సరుకుల పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగరం వరద బారినపడడం అత్యంత బాధాకరమని హైదరాబాద్ కూకట్‌పల్లి బాప్టిస్ట్ చర్చి పాస్టర్, రెవ.టీజీ సునీల్ కుమార్ అన్నారు. వరద బాధితులకు ఆ చర్చి ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని గిద్యోను ప్రార్థనా మందిరం ఆవరణలో సరకులు అందజేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం అంటే ఆ దేవునికి సేవ చేయడంతో సమానమన్నారు. 200 కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకుల కిట్లను అందించడం సంతోషంగా ఉందన్నారు. దాతలు సాయం అందించాలని సూచించారు. ఆల్ ఇండియా బీసీటీసీ జనరల్ సెక్రెటరీ పాస్టర్ రెవ.మంగలపూడి జోసఫ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాస్టర్ అజయ్‌బాబు, ఎస్.ఆశీర్వాదం, సుందరరాజు, ప్రసాద్, బన్నీ, చంటి పాల్గొన్నారు.

దసరా విశిష్టతపై చిత్రలేఖనం పోటీలు



చిన్నారులు వేసిన చిత్రాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బందర్ రోడ్డు ఠాగూర్ గ్రంథాలయంలో ప్రతి ఆదివారం నిర్వహించే చదవటం మాకు ఇష్టం కార్యక్రమంలో భాగంగా దసరా విశిష్టతపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ సామ్రాజ్యం విద్యార్థులకు దసరా పండుగ ప్రాముఖ్యతను వివరించారు. జగన్మాత దుర్గాదేవి మహిషాసురుడు అనే రాక్షసుడితో తొమ్మిది రోజులు యుద్ధం చేసి అతనిని వధించి విజయాన్ని పొందిన సందర్భంగా పదో రోజు ప్రజలందరూ సంతోషంగా విజయ దశమి జరుపుకుంటారని తెలిపారు. ఈ సన్నివేశాలకు సంబంధించి దసరా చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డ్రాయింగ్ టీచర్ దుర్గాభవాని, సంగీతం టీచర్ దివ్య మాధురి, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఐఎంఏ నగరశాఖ నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీతో ఐఎంఏ సీనియర్ సభ్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) విజయవాడశాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గవర్నర్‌పేటలోని అసోసియేషన్ హాల్లో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో 2024-25 సంవత్సరానికి గాను నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా డాక్టర్ బోడేపూడి హనుమయ్య, కార్యదర్శిగా డాక్టర్ వుమ్మినేని సురేష్‌కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, కోశాధికారికి జరిగిన ఎన్నికలో డాక్టర్ ఎంవీ సుబ్బారావు గెలుపొందారు. వీరితో పాటు ఉపాధ్యక్షులుగా డాక్టర్ వీఎస్ వరప్రసాద్, డాక్టర్ వి.పద్మజ, జాయింట్ సెక్రటరీలుగా డాక్టర్ పి.సుశీల, డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్, స్టేట్ కౌన్సిల్ సభ్యులుగా డాక్టర్ పి.అనిల్‌కుమార్, డాక్టర్ పి.జయకర్‌బాబు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా డాక్టర్ పీఈ సోనిలాల్, డాక్టర్ కదీర్ షరీఫ్, డాక్టర్ జి.శరత్‌చంద్రలు ఎన్నికయ్యారు.

■ సబ్సిడీపై టమాటా, ఉల్లి విక్రయాలు

కృష్ణలంక(విజయవాడ తూర్పు): కృష్ణలంక రైతుబజార్‌లో మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై టమాటా, ఉల్లిపాయాలు విక్రయిస్తున్నట్లు రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ జాన్‌విక్టర్ పాల్ తెలిపారు. ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి టమాటా రూ.48, ఉల్లిపాయలు రూ.33కు అందుబాటులో ఉంచామన్నారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.